www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 23 ఏప్రిల్ 2023

5

వైఎస్‌ఆర్

పుష్పగిరిలో వైభవంగా చందనోత్సవం

ప్రజాశక్తి - వల్లూరు

పవిత్ర పుణ్యక్షేత్రాలు ఒకటిగా పిలవబడుతున్న పుష్పగిరిలో కామాక్షి సమేత వైద్యనాథేశ్వర లక్ష్మీ చెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నకేశవుడి మూల విరాట్‌ను చందనంతో అలంకరించారు. ముందుగా యాగశాలలో విశ్వక్సేన ఆరాధన నిర్వహించిన అనంతరం పుణ్యహవచనాన్ని వేద పండితులు నిర్వహించారు. యాగశాల పూజ నిర్వహించి నిత్యార్చన వివిధ హోమాలు చేశారు. అనంతరం హనుమంత వాహనంపై చెన్నకేశవుడిని, మయూర వాహనంపై వైద్యనాథేశ్వరుని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

గ్రావెల్ గుట్టలు మాయం

అనుమతులు లేకున్నా అక్రమ తవ్వకాలు

ట్రాక్టర్, ట్రక్కుల్లో రవాణా

తూతూ మంత్రంగా తనిఖీలు

అండగా ప్రజాప్రతినిధులు

పట్టని అధికారులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని గ్రావెల్ గుట్టలు మాయమవుతున్నాయి. కొందరు స్వార్థ పరులు అక్రమ తవ్వకాలతో గుట్టలు కరిగిపోతున్నాయి. మండల పరిధిలోని వలసపల్లె, కదిరి వారి పల్లె, తుమ్మలపల్లె, పెదనపాడు గ్రామాలలో ఉన్న గ్రావెల్ గుట్టలు పూర్తిగా కనుమరుగయ్యాయి. గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖల అను మతులు లేకుండానే కొందరు వ్యక్తులు గ్రావెల్ మట్టిని ట్రాక్టర్ల సాయంతో పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రయి వేట్ భూములలో సైతం మట్టిని తవ్వాలన్నా ప్రభుత్వ అనుమతులు ఉండాల్సిందే, కానీ ఇటువంటి అనుమతులు లేకుండా పట్టపగలే నల్ల, ఎర్ర మట్టిని అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించు కోక పోవడం శోచనీయం. అధికారులు అప్పడప్పుడూ మట్టిని రవాణా చేస్తున్న వాహ నాలకు జరిమానాల విధిస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టపగలే మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫల మయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల పాత్ర ఈ అక్రమ రవాణా వెనుక ఉందని, ఎంతో కొంత మామూలు తీసుకుంటూ వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో బలంగా విన్పిస్తోంది. ఇలా కొందరి స్వార్థం కోసం చేస్తున్న అక్రమ తవ్వకాల ద్వారా పలు గ్రామాలలోని చాలామంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులకు చెందిన గొర్రెలు, గేదెలు, ఆవులు, మేకలు వంటి వాటికి గుట్టలపై ఉండే గడ్డి, చెట్లు మేతగా ఉండేవి. కానీ గుట్టలు కొల్లగొట్టడంతో రైతులు పశువులకు మేతను అధికంగా కొనాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు పశువుల పోషణ భారంగా మారింది. కొందరు రైతులు పశువులను అమ్ముకునే పరిస్థితిలో ఉన్నారు. దీనికి కారణం అధికారులా ? ప్రజా ప్రతినిధులా ? మట్టి అక్రమ తవ్వకం దారులా ? ఎవరిని నిందించాలంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వలసపల్లె నుంచి పరిసర గ్రామాలకు, పట్టణంలోని పలు ప్రాంతాలకు అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. ఒక ట్రిప్పు ట్రాక్టర్ రూ.1100లకు విక్రయి స్తున్నట్లు అమ్ముతున్నట్టు సమాచారం. ఇలా వచ్చిన డబ్బులలో కొంత డబ్బులు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఇవ్వడంతో ముందుండి అంతా వారే చూసుకుంటున్నట్లు ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనా మట్టి అక్రమ తవ్వ కాలను, రవాణాను అడ్డుకొని ప్రకృతి వనరులను కాపాడాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్లతో తోలుతున్న మట్టి

మాదృష్టికి రాలేదు

ప్రయివేట్ సినరేజ్ సంస్థ వారు అక్రమ రవాణా దారులను పట్టుకొని జరిమానాలు విధిస్తున్నారు. మట్టి అక్రమ రవాణా మా దృష్టికి రాలేదు. అలా ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- రాజేష్ కుమార్, ఏడీ గనులు భూగర్భ శాఖ, ఎర్రగుంట్ల.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

శనివారం పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జిల్లాలోని మసీదులు, దర్గాలు, ఈద్గాలు ముస్లిమ్ సోదరులతో నిండిపోయాయి. కడప నగరంలోని బిల్టప్ సమీపంలో ని ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, అమీర్‌బాబు తదితర నాయకులు పాల్గొని ఈదుల్ ఫితర్ నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

విప్లవ యోధుడు లెనిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల్లో శాస్త్రీయ సోషలిస్టు బోధనలు ప్రచారం చేయడమే లెనిన్‌కు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం పాతబస్టాండ్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రష్యా విప్లవ యోధుడు లెనిన్ 153వ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ లెనిన్ కేవలం 54 సంవత్సరాలు మాత్రమే జీవించారని పేర్కొన్నారు. ఆయన జీవించిన కాలంలో చరిత్ర నిర్మించేది ప్రజలే అన్నారు. సమాజ మార్పుకు నాయకత్వం వహించాల్సింది కార్మికులు, కష్టజీవులేనని పేర్కొన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి కార్మిక కష్టజీవుల రాజ్యాన్ని, ప్రత్యామ్నాయ విధానాలతో నిర్మించి దోపిడీ వర్గాల గుండెల్లో గుబులు పుట్టించిన విప్లవకారులు లెనిన్ అన్నారు. ఆచరణాత్మక బోధనలు నేటి తరానికి కూడా నిత్య నూతనమే అన్నారు. లెనిన్‌కు ఘనమైన నివాళి అర్పించడం అంటే ప్రజలతో మమేకమై పని చేయటమేనన్నారు.

లెనిన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు

ప్రజల్లో శాస్త్రీయ సోషలిస్టు బోధనలు ప్రచారం చేయడమే అన్నారు. సమాజాన్ని పురోగమనం వైపు మళ్లించడంలో మానవ జీవితంలో ఆర్థిక వ్యవస్థ ప్రాధాన్యత గురించి ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించిన మహా మేధావి లెనిన్ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామమోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, రాజామణి, ఉదయ్, నారాయణరెడ్డి, రఘు పాల్గొన్నారు.

నేడు జిల్లా వృత్తిదారుల సమావేశం

కడప అర్బన్ : జిల్లా వృత్తిదారుల సమన్వయ కమిటీ విస్తృత సమావేశం ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. చేతి వృత్తిదారుల రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ భాస్కరయ్య హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని వృత్తిదారుల కుటుంబాల నుంచి యువతీ యువకులు హాజరు కావాలన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో విద్యుత్ కోతలకు సమయపాలన లేకుండా పోయిందని, రాత్రిపూట గంటల తరబడి విద్యుత్ కోత విధించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కారణాలు తెలియజేయకపోవడం ఏంటని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మాసాలుగా నగరంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ కోతకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విద్యుత్ అధికారులు పట్టి పట్టినట్లు వ్యవహరించడం సరి కాదన్నారు. మరోపక్క 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ రాత్రిపూట గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడం తగదన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. చంద్రశేఖర్, గుంటి వేణుగోపాల్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వలరాజు, ఎస్.కె. మైనుద్దీన్ పాల్గొన్నారు.

దాతృత్వ సేవలు మరువలేనివి

పోరుమామిళ్ల : దాతృత్వ సేవలు మరువలేనివని హంస అవార్డు గ్రహీత భజన పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని సిద్దవరం పంచాయతీలోని చిన్నాయిపల్లెలో ఉన్న రామస్వామి ఆలయానికి ఉప సర్పంచ్ అంబవరం రమణారెడ్డి రూ.22 విలువ చేసే మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈనేపథ్యంలో భజన పుల్లయ్య ఆధ్వర్యంలో చిన్నాయపల్లె శ్రీకోదండరామస్వామి కోలాట బృందంచే కోలాటం నిర్వహించారు. గురువులు బాల గురయ్య, ముండ్లపాటి ప్రసాదరావు, నాయనపల్లి ఓబులేసు, గ్రామ యువత నాయకుడు మేరుగ నారాయణ, పూజారి అవధాన నాగేంద్ర స్వామి, కళా కారులను పెద్దలను శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం. చిన్న చెన్నయ్య, ఎస్. చెన్నయ్య, ఎం. పెద్ద చెన్నయ్య, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోలాట బృందంతో దాతలు

చలో విజయవాడ జయప్రదం చేయండి

పోరుమామిళ్ల టౌన్ : విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో ఈనెల 24న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ పిలుపునిచ్చారు. ఆయన పోరుమామిళ్ల లో మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ దుర్మార్గపు పాలనను ఎండ గట్టేందుకు, కేంద్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను సైతం నిర్వీర్యం చేసే విధంగా చేస్తున్న విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం పదిలం

కడప : విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకుని ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని డేటాల్ బనేగా స్వస్థ ఇండియా స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ కుమారి తెలిపారు. స్థానిక చెమ్ముమియాపేట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సార్డ్స్, గ్రామాలయ స్వచ్ఛంధ సంస్థ, డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా ఆధ్వర్యంలో శుభ్రత, పరిశుభ్రత మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే పిల్లలు చేతులు శుభ్రం చేసు కో కుండా ఆహారం తింటే చేతుల్లో ఉన్న బ్యాక్టీరియా నోటిలోకి వెళ్లి వివిధ రకాల వ్యాధులు వస్తాయన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులు పాఠశాలకు సబ్బులు అందజేస్తే, ప్రతి ఒక్కరూ రోజూ సబ్బులతో చేతులను శుభ్రం చేసుకునే అలవాటు అలవడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డేటాల్ బనేగా స్వస్థ ఇండియా జిల్లా ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ విష్ణువర్ధన్, పాల్గొన్నారు.

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

కడప అర్బన్ : భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పర్యావరణ మిత్ర బృందం సభ్యులు ఎం.ప్రసాద్‌రెడ్డి, బి.భరత్‌కుమార్, జి.వి.సాయిప్రసాద్, సుజాత ఖాన్, బి.పుష్పరాజు అన్నారు. శనివారం ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. పర్యావరణ మిత్ర సమూహం ఆధ్వర్యంలో నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ నుంచి ఎన్‌సిసి విద్యార్థులతో నగరపాలక ఉన్న పాఠశాల మెయిన్ నుంచి పాత కలెక్టరేట్ ఇంటాక్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పట్ల, పర్యావరణ రక్షణకు అవగాహన కల్పించడానికి ప్రకృతి పై ప్రేమను పెంచడానికి వాలంటీర్‌గా పని చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్, ఇంటాక్ కడప చాప్టర్ కో-కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి జీవవైవిద్య మండలి కడప శివారెడ్డి, బయోడ్రైవర్శిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దినకర్, ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ కుమార్ స్వామి, పూర్వపు ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ సుధా ఎలియాస్ రెడ్డి, లైన్స్ క్లబ్ చైర్మన్ రంగనాధరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప : యువత ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని డిఎస్‌పి వెంకట శివ రెడ్డి అన్నారు. రంజాన్ పండగ సందర్భంగా శనివారం కడప నగరంలో ఉన్న బిల్డప్ సర్కిల్ వద్ద రాయల్ రషీద్ సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డిఎస్‌పి వెంకట శివారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ మోటార్ వాహనాలు అతివేగంగా నడప రాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప అర్బన్ : రంజాన్ పండుగ పురస్కరించుకుని నగరంలోని శిల్పారామం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆవరించాయి. శనివారం మిస్పా మూవీ సహకారంతో పులివెందులకు చెందిన ఎస్.కె. డ్యాన్స్ కడపకు చెందిన ఆర్‌కె అకాడమీ వారు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వ హించారు. సినీ, జాన పద, హిందీ గీతాలకు కళా కారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. ఆదివారమూ సాంస్కృతి కార్యక్రమాలుంటాయన్నారు.

నృత్యాలు చేస్తున్న అకాడమీ సభ్యులు

మ్యాక్స్ ఆస్పత్రి ప్రారంభం

కడప అర్బన్ : నగరంలోని ఎర్రముక్కపల్లిలో కార్డియాలజీ డాక్టర్ వంశిధర్, ఆప్తమాలజీ డాక్టర్ విధ్యాధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మ్యాక్స్ ఆస్పత్రిని శనివారం మేయర్ సురేష్‌బాబు, జడ్‌పి చైర్మన్ అమర్‌నాధరెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో 21వ డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, వైస్‌ఆర్‌టిఎఫ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

90 పరుగులకే కుప్పకూలిన నెల్లూరు జట్టు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్స్ టి-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 90 పరుగులకే కుప్పకూలింది. 8 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగుకు దిగిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 90 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సాకేత్ రామ్ 21, పి. మోహన్ కృష్ణ 20 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని వై. గిరీష్ కుమార్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. కె. దీపక్ సాయినాథ్ 2, ఏ. సూర్య 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 91 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 11.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టు లోని అభిషేక్ ఎం రెడ్డి 41, కే.ఎన్. పృథ్వీరాజ్ 26 (నాట్ అవుట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాకేత్ రామ్, పి. మహేష్ లు చెరో ఒక్క వికెట్ తీసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో జట్టు 6 వికెట్ల తేడాతో కర్నూలు జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. తౌఫిక్ హుస్సేన్ 51 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని బి.ఎస్. వినయ్ కుమార్ 2, ఎం. దీపక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 120 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన అనంతపురం జట్టు 14.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని ఎం కె. దత్త రెడ్డి 56, బి. యోగానంద 34 (నాట్ అవుట్) పరుగులు చేశారు. కర్నూలు జట్టు లోని ఎస్.కె ఖమరుద్దీన్ 2 వికెట్లు తీసుకున్నాడు.

అసౌకర్యాల నడుమ అంగన్వాడీ కేంద్రం

- చుట్టూ మురుగు నీరు
- దుర్గంధం... దోమల స్వైరవిహారం
- ఇబ్బందుల్లో చిన్నారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- పట్టని అధికారులు, పాలకులు

అసౌకర్యాల నడుమ అన్నం తింటున్న చిన్నారులు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని 45వ డివిజన్ ఊటుకూరు దళితవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రం అసౌకర్యాల నడుమ కొట్టు మిట్టాడుతుంది. అంగన్వాడీ భవనం ఆనుకునే వెనుక భాగంలో కుంటను తలపించేలా మురు గునీరు నిల్వ ఉంది. ఒక పక్క దుర్గంధం, మరో వైపు దోమల స్వైర విహారం. దీంతో అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టపగలే దోమలు స్వైరవిహారం చేస్తుతండడంతో ఎక్కడ తమ పిల్లలు విషజ్వరాల బారిన పడుతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం పూట చిన్నారులు దుర్గంధం నడుమనే తినాల్సిన దుస్థితి నెలకొంది. దుర్గంధం రాకుండా అంగన్వాడీ కేంద్రం కిటికీలు మూస్తే ఉక్క పోతతో పిల్లలు అల్లాడుతున్నారు. ఇలాంటి దుస్థితిలో తమ పిల్లల్ని అంగన్వాడీ పాఠశాలకు పంపాలనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కేంద్రంలో కనీసం తాగేందుకు మంచినీటి సౌకర్యం లేదు. పేరుకు మాత్రం ఓ ట్యాంక్ అక్కడ ఏర్పాటు చేశారు. కానీ ట్యాంక్‌లో నీరు, కుళాయిలు లేవు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని నాడు నేడు కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. అయితే ఊటుకూరులోని దళితవాడలోని అంగన్వాడీ కేంద్రం అద్దె భవనం కాదు. ప్రభుత్వ సొంత భవనం. నాడు నేడు కార్యక్రమం కింద ఈ భవన రూపురేఖలు మాత్రం మారలేదు సౌకర్యాలు ఎక్కడ వేసినా గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. అంగన్వాడి కేంద్రం వెనుక భాగాన ఉన్న మురుగు నీరు వెళ్లేందుకు దారిలేకపోవడంతో అలానే నిల్వ ఉంటోంది. ఎండాకాలంలోనే ఇలా ఉంటే మరి వర్షాకాలం వస్తే ఆ ముగురునీరంతా అంగన్వాడీ కేంద్రంలోకి వస్తాయని పిల్లల తల్లితండ్రులు అంటున్నారు. దీని అంతటికి ప్రధాన కారణం అధికారులు పాలకులు పట్టించుకోకపోవడం ఏనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఊటుకూరులోని దళితవాడలో దాదాపు 100 కుటుంబాలు పైనే జీవనం సాగిస్తున్నాయి. రోడ్లు అంతంత మాత్రమే. ఇక డ్రెయినేజీ వ్యవస్థ చూస్తే అస్తవ్యస్తం. ఇళ్లలో నుంచి వచ్చే నీరంతా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అంగన్వాడీ కేంద్రం వెనుక భాగాన నిల్వ ఉంటోంది. అంగన్వాడీ కేంద్రానికి బాత్‌రూమ్‌లు లేవు. చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్నో సమస్యలు. ఇప్పటికైనా అధికారులు నగరపాలకులు తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని దళితవాడ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఉన్న మురుగుకుంట

అంగన్వాడీ కేంద్రానికి పంపించాలంటే భయం..

పిల్లలను చదువుకునేందుకు అంగన్వాడీ కేంద్రానికి పంపించాలంటే భయం వేస్తుంది. అంగన్వాడీ కేంద్రం వెనుక భాగాన, పక్కన మురు గు నీరు నిల్వ ఎప్పుడూ ఉంటుంది. ఒకటే దుర్గంధం, దోమల స్వైర విహారం. పిల్లలకు విషజ్వరాలు, నానా జబ్బులు వస్తాయన్న భయంతో అల్లాడు తున్నాం.

- దేవగుడి శివప్రసాద్, స్థానికుడు.

పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

డ్రెయినేజీ ముగురునీరు అంగన్వాడీ కేంద్రం వద్ద నిల్వ ఉండకుండా అధికారులు, పాలకులు తగు చర్యలు తీసుకోవాలి. సొంతభవనమైనా డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయాలి. లేదా పిల్లల్ని అద్దెభవనమైనా మరో చోటికి మార్చాలి ఎందుకంటే అంగన్వాడీ కేంద్రం చుట్టూ మురుగు నీరు వల్ల చిన్నారులు, కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు అనారోగ్యానికి గురవుతారు. తక్షణం అధికారులు స్పందించి సమస్యకు పరిష్కార మార్గం చూపాలి.

- బి.లక్ష్మీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కడప.

పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లే..



కడప నగరం 45వ డివిజన్ ఊటుకూరు దళితవాడలో ఇన్ని సమస్యలు ఉన్నాయంటే అది పాలకులు అధికారుల నిర్లక్ష్య వైఖరి. దళిత వాడాలంటే అంత నిర్లక్ష్యం ఎందుకు. ఊటుకూరు దళితవాడలో రోడ్లు అంతంత మాత్రమే ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. అంగన్వాడీ కేంద్రం విషయానికి వస్తే సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికారులు తమ నిర్లక్ష్య ధోరణినీ విడనాడి సమస్యలు తక్షణం పరిష్కరించాలి.

- పాలగిరి శివ, స్థానికుడు.

నిర్దేశమేదీ?

ప్రజాదృష్టి

తెలుగుదేశం పార్టీ జోన్-5 సమీక్షా సమావేశంలో స్పష్టత కొరవడింది. రాయలసీమలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన నియోజకవర్గ, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో కూడిన సమావేశంలో అన్నింట్లో గెలవాలనే దిశను చూపించిన మాట వాస్తవమే. కానీ నిర్దేశమే కొరవడిందని చెప్ప వచ్చు. 35 అసెంబ్లీ ఇన్‌ఛార్జిల్లో బాగా పనిచేసిన ముగ్గురిని ఎంపిక చేసి వారి అనుభవాలను వివరించడం వరకు బాగానే ఉంది. క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయని, పనిచేయలేని వారికి అవసరమైన చేయూతను అందించడం గురించి ప్రస్తావించి ఉండాల్సి ఉంది. అధికార వైసిపి శ్రేణుల దాడిని తట్టుకుని క్షేత్రస్థాయిలో పనిచేయడం సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో వారి పరిమితులను అర్థం చేసు కోకుండా, పనిచేసిన వారికి దగ్గరగా ఉంటానని, పని చేయనివారిని గుర్తించబోమని చెప్పడం విచిత్రంగానే ఉంటోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో చురుకుగా పని చేసిన సుమారు 62 మంది టిడిపి కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. బాధిత కార్యకర్తలకు ఆర్థిక, న్యాయపరమైన సహాయాన్ని అందిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుని స్థాయిలో కడపలో ఓ ఫంక్షన్ హాలులో నిర్వమించిన సమావేశంలో ఇచ్చిన హామీలు అమలు కాని నేపథ్యంలో కార్యకర్తల మానసిక పరిస్థితేమిటో ఆలోచించుకోవాలి. జాతీయ అధ్యక్షుని స్థాయిలో ఇచ్చిన హామీలు అమలుకు నోచని పరిస్థితుల్లో కింది స్థాయి బూత్ లెవల్ ఇన్‌ఛార్జిల పరిస్థితేమిటో ఆలోచించుకోవాలి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార వైసిపి శ్రేణులను తట్టుకుని బూత్ లెవల్‌లో పోరాటం చేయడమంటే మాటలు కాదని గమనించాలి. ముందుగా టిడిపి జాతీయ నాయకత్వం ఇచ్చిన హామీలను అమలు పరిచిన అనంతరం బూత్‌లెవెల్ ఇన్‌ఛార్జిలకు అవసరమైన మనోధైర్యాన్ని ఇచ్చే ప్రయత్నం చేయాలి. ముఠా రాజకీయాలను ప్రజాస్వామ్య పద్ధతులతో ఎదురించిన మాజీమంత్రి బిజీవేముల వీరారెడ్డిని స్ఫూర్తిని తీసుకోవాలనడం వరకు బాగానే ఉంది. మారిన రాజకీయ వాతావరణంలో బరితెగించిన రాజకీయం నడుస్తున్న నేపథ్యంలో అన్ని చోట్లా అమలు చేయడం కత్తి మీద సామును తలపిస్తోందని చెప్పవచ్చు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు టిడిపి అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్ల వరకు ప్రతీకారమే నడుస్తుందని పేర్కొనడం శోచనీయం. అలా చేయడం వల్ల ప్రజలకు మీరిచ్చే సందేశమేమిటో ఆలోచించు కోవాలి. కంటికి కన్ను, ప్రాణానికి ప్రాణం అనే రాజరికం తరహాలో శిక్షణ విధించడం వంటిదని గమనించాలి. దీనివల్ల ఒరిగేమీ లేక పోగా భవిష్యత్ రాజకీయం కలుషితమవు తుందని చెప్పవచ్చు. కార్యకర్తలకు ఆర్థిక పరమైన భద్రతను కల్పించి ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమున్నతులుగా నిలిచేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలి. అప్పుడే క్షేత్రస్థాయి కార్యకర్తలు పట్టుగొమ్మగా నిలిచే అవకాశం ఉంది. ఫలితంగా ఎటువంటి కష్టనష్టాలైన ఎదుర్కొని నిలబడే పరిణితి, సామర్థ్యం అలవడతాయనే సంగతిని గమనించాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు. అటువంటి పనులు చేయకుండా ఎన్నికల్లో గెలిచిన వెంటనే పదవులు అనుభవిస్తూ, కార్యకర్తలను గాలికి వదిలేసినప్పుడే పార్టీ పరిస్థితి దిగజారిపోతుందని గమనించాలని గత ఫలితాలు రుజువు చేస్తున్న సత్యాన్ని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకు మెగా డిఎస్‌సిని విడుదల చేయలేదని, జాబ్ క్యాలెండర్ ఊసేలేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే దాదాపు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. తద్వారా వలసలు ఆగిపోతాయని తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

మానసికోల్లాసానికి క్రీడలు

- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. స్థానిక యూత్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ పక్కన ఉన్న మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం భూపేష్‌రెడ్డి ప్రారంభించారు. టోర్నీలో పాల్గొన్న జట్టు ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

వైసిపి అరాచకం సిగ్గు చేటు

ప్రజాశక్తి - చాపాడు

యర్రగొండపాలెంలో వైసిపి అరాచకం సిగ్గు చేటని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి నేట్రపల్లి శివరామ్ ఖండించారు. ఆ మేరకు శనివారం ఆయన టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో పర్యటిస్తున్న చంద్రబాబు కాన్వాయ్‌పై మంత్రి ఆది మూలపు సురేష్ దగ్గరుండి వైసిపి రౌడీ మూకలచే రాళ్ల దాడి చేయించడం ఆటవిక మన్నారు. బాధ్యతాయుత పదవిలో ఉండి మంత్రి సురేష్ బట్టలు విప్పి వీధిరౌడీలా సవాలు చేయడం దేనికి సంకేతమని రాష్ట్ర ప్రజలు అందరూ గమనించాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని ఆరోపించారు. దాడి చేసిన వైసిపి గూండాలు, రౌడీ మూకలను వదిలేసి, టిడిపి శ్రేణులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమని తప్పు పట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గురప్ప, టిడిపి జిల్లా కార్యదర్శి సిద్దయ్య, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ అల్తాఫ్, బుర్రి నాగరాజు పాల్గొన్నారు.

అన్ని విధాలా నష్టపోయిన రైతులు, ప్రజలు : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు, రైతులు అన్ని విధాలా నష్టపోయారని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డులో శనివారం ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసున్నారు. కార్యక్రమంలో 38వ వార్డు ఇన్‌ఛార్జి యిట్టే సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీని వాసులు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, మెరువా మూర్తి, రూలర్ మండలం కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, గోపవరం గౌస్, భగత్‌సింగ్ కాలనీ పట్నం మాబాషా, ఇర్ఫాన్, శివ, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వింటున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

సిరులు కురిపిస్తున్న నువ్వులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది సాగుచేసిన నువ్వుల పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు కొంత వరకు తృప్తిగా ఉన్నారు. ప్రస్తుతం ధర క్వింటా రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. నూనె గింజల ఉత్పత్తిలో నువ్వుల పంట ఒకటి. ఈ నువ్వుల పంటనే ఉష్ణ పంటగా కూడా పిలుస్తారు. ప్రతి ఏడాది వేసవిలో నువ్వుల పంట సాగు చేస్తారు. పులివెందుల నేలలు కూడా నువ్వుల సాగుకు అనుకూలిస్తాయి. ప్రతి రైతు ఎంతో కొంత విస్తీర్ణంలో నువ్వు పంట వేశారు. గతంలో సాగునీటి సమస్య కారణంగా కొద్ది మంది రైతులు మాత్రమే నువ్వుల పంట సాగు చేసేవారు. ప్రస్తుతం కృష్ణా జలాలు అందుబాటులో ఉన్న కారణంగా చాలా మంది రైతులు నువ్వు పంట సాగుపై మక్కువ చూపారు. గతంలో కంటే ఈ ఏడాది నూగు పంట విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది. గతంలో మే మొదటి లేదా నువ్వుల దిగుబడి ఇల్లు చేరుతుంది. నువ్వుల పంట దిగుబడి ఇల్లు చేరాలంటే కనీసం మూడు నెలల వ్యవధి పడుతుందని రైతులు చెబుతున్నారు. పూర్తిగా నీటి వసతిపై ఆధారపడి నూగు పంట సాగు ఉంటుంది. అన్ని సక్రమంగా ఉన్నా.. ఏప్రిల్, మే నెలల్లో కురిసే అకాల వర్షాలకు నువ్వుల పంట నిలదక్కోవాల్సి ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ దపా ముందస్తుగా పంట వేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాల నుంచి కొంతవరకు తప్పించుకునే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. తెగుళ్లతో సతమతమయ్యే రైతులకు నువ్వుల పంట కాస్త ఊరట ఇచ్చినట్లు చెప్పవచ్చు. నువ్వులను నిల్వ చేసుకునే అవకాశం కూడా రైతులకు ఉంది. గిట్టుబాటు ధర ఉన్నప్పుడు మాత్రమే విక్రయించుకుని రైతులు చేసుకోవడం అలవాటు. ప్రస్తుతం యాంత్రిక జీవనం సాగిస్తున్న ప్రతి రైతు పంట దిగుబడిని పొలాలపై విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది సాగు చేసిన నువ్వులకు ధర ఆశ జనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగులో ఉన్న నువ్వుల పంట

16 మంది రక్తదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రాణం విలువ తెలిసిన 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని బ్లడ్ 2 లివ్ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రక్తకొరత అధికంగా ఉంటుందని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రిమ్స్‌లో అనేకమంది రోగులు సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్లడ్ 2 లివ్ సభ్యులు తోట కళ్యాణ్, పల్లా జయకృష్ణ, తోట మోహన్ సాయి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సిట్టర్ రెస్చుల్, టెక్నిషన్స్ జయచంద్రారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న మహిళ

ఆహ్లాదకరం.. శిల్పారామం

చిన్నారులు ఆడుకునేందుకు సదుపాయాలు - జిప్‌లైన్ రోప్‌వే ఏర్పాటు

పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

ఆకట్టుకుంటున్న కాడెద్దులు, రైతు ప్రతిమ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల శిల్పారామ పచ్చదనంతో ఆకర్షణీయంగా ఆహ్లాదాన్నిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో శిల్పారంలో మరికొన్ని సదుపాయాలు కల్పించేందుకు రూ.12.26 కోట్లతో ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో 38.50 ఎకరాల్లో, అలాగే దీనికి సంబంధించి పది ఎకరాల్లో ఫంక్షన్ హాల్‌ను ఐదు కోట్ల రూపాయలతో నిర్మించిన శిల్పారామాన్ని 2008 డిసెంబర్ 25న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే శిల్పారామం అభివృద్ధి పనులకు సంబంధించి రూ.9.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే పాడా నిధుల కింద ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి అభివృద్ధి పనులకు మరో రూ.2.76 మంజూరు చేశారు. ఈ నిధులతో శిల్పారామంలో పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. పాడా నిధుల కింద మంజూరైన పనులకు సంబంధించి కాంపౌండ్ వాల్ సంబంధించి రూ.91 లక్షలు, సిసి రోడ్లకు రూ.92 లక్షలు, హిల్ టాప్స్ టవర్ పార్కింగ్ రూ.93 లక్షలతో పనులు, అలాగే ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులకు సంబంధించి రూ.9.5 కోట్లకు సంబంధించి జిప్‌లైన్ రోప్ పనులు, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, ఎనిమిది నూతనంగా నిర్మిస్తున్న కొత్త స్టాల్స్ పనులు పూర్తికావచ్చాయి. వాటర్ ఫాల్స్ పనులు, నాలుగు గజి బోస్(వేసవి విడది గృహాలు) ప్రజల సౌకర్యార్థం కుర్చీలకు సంబంధించి పనులు, టాయిలెట్స్ నిర్మాణం, బోటింగ్ హైలాండ్ పనులు, శిల్పారామం ముఖద్వారం పనులు, క్యాష్కేడ్ మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ పనులు కూడా పూర్తి కావచ్చాయి. శిల్పారామం ప్రారంభమైనప్పటి నుంచి పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వెళ్లి కాలక్షేపం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఉయ్యాల, బోటింగ్, మరిన్ని ఆటవస్తువులతో ఆడుకుంటూ ఆనందంగా గడుపుతూ ఉంటారు. అంతేకాకుండా మరో రెండు బోట్లు తెప్పించారు. ప్రతి ఆదివారం, పండగల సందర్భంగా ప్రజలతో శిల్పారామం కళకళలాడుతూ ఉంటోంది. ముఖ్యంగా పరిపాలనాధికారి సుధాకర్ చిన్నారులతో వివిధ రకాల నృత్య, ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ రోజున ముగ్గులు, క్విజ్ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ దాదాపు పూర్తి కావచ్చాయి. త్వరలోనే ఆధునీకరణ సౌకర్యాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నారు.

అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం

శిల్పారామానికి వచ్చే పర్యటకులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దాదాపుగా ప్రతిరోజు 350 మందికి పైగా వస్తున్నారు. సందర్శనార్థం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 టికెట్ పెట్టాం. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేశాం. ఇక్కడ బోటింగ్ చేసేవారికి లైఫ్ జాకెట్లు ఇస్తున్నాం. ప్రథమ చికిత్స సౌకర్యం కూడా ఉంది. జరుగుతున్న పనులన్నీ త్వరలో పూర్తి కానున్నాయి. జూన్‌లో నూతనంగా నిర్మించిన వాటిని సిఎం జగన్ చేతుల మీదగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. **- సుధాకర్‌రెడ్డి, శిల్పారామం పరిపాలన అధికారి**

నక్కలదిన్నె గోడౌన్ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని 9 సచివాలయాల పరిధిలో నూతనంగా ధాన్యపు నిలువ చేసుకునేందుకు గోడౌన్ల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నక్కలదిన్నె గ్రామంలో 0.50 ఎకరాలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గౌడౌన్ నిర్మించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మార్కెట్ యార్డ్ జిల్లా అధికారులతో శుక్రవారం మాట్లాడారు. నిర్మాణ పనులకు సంబంధించి 24న సోమవారం టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే తెలిపారు. బద్రిపల్లె, చాపాడు, చిన్నగురువలూరు, చియ్యపాడు, లక్ష్మీపేట, పల్లవోలు, వెదురూరు గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు, ఎస్.ఓబాయపల్లి, సోమపురం గ్రామాల్లో 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్‌ల నిర్మాణానికి అనుమతి వచ్చిందన్నారు. గోడౌన్‌ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని, వచ్చే ఏడాదికి వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నక్కలదిన్నెలో గౌడౌన్ నిర్మాణానికి అదే గ్రామానికి చాపాడు చానల్ మాజీ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ సోముల మహేశ్వర్‌రెడ్డి స్థల వితరణ చేశారు. ఈ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపిపి టి.లక్షుమయ్యను, అధికారులను ఆదేశించారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఘనంగా లెనిన్ జయంతి

లెనిన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రష్యన్ కమ్యునిస్టు పార్టీ విప్లవకారుడు మార్క్సిజానికి దిక్సూచి, అక్టోబర్ విప్లవ సాధకుడు వి.ఐ.లెనిన్ అని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌లో ఎద్దుల ఈశ్వర్ రెడ్డి విగ్రహం వద్ద ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ లెనిన్ 1870 ఏప్రిల్ 22 న జన్మించాడన్నారు. లెనిన్ పూర్తి పేరు వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యోనొవ్ లెనిన్ అన్నారు. రష్యన్ కమ్యునిస్టు రాజ్యస్థాపన కారకుడన్నారు. సోవియట్ యూనియన్ దేశాలను ఒక తాటిపైకి తెచ్చి పెట్టుబడిదారి సామ్రాజ్యానికి నిద్రలేని పరిస్థితి తెచ్చాడన్నారు. కార్మిక వర్గ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. అందుకే సోషలిస్టు దేశంగా ఎదిగిందన్నారు. అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే లెనిన్ సిద్ధాంతం అన్నారు. మోడీ నియంత పోకడలను, కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరానాల శివకుమార్, సిపిఎం నాయకులు స్వామి, దివాకర్, శ్రీను, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

జమ్మలమడుగులో ప్రత్యేకప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాష, పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేని, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అమీర్‌బాబు, కాంగ్రెస్‌పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహమ్మద్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, కార్పొరేటర్ షఫీ, టిడిపి నాయకులు జిలానిబాష, నాసర్‌అలీ, మాజీ కార్పొరేటర్ ఇనాయతుల్లా, వైసిపి నాయకులు సుభాన్‌బాష, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం అంజాద్‌బాష మాట్లాడుతూ ముస్లిములు వారి సంపాదనలో రెండున్న శాతం జకాత్ రూపంలో పేదకు పంచిపెడతారని తెలిపారు. సేవ, అన్నదాన కార్యక్రమాలు ఎన్నో చేశారని చెప్పారు. మతసామరస్యానికి భారతదేశం ప్రతీక అన్నారు. అందరూ సోదరభావంతో మెలగాలని ప్రార్థించామని తెలిపారు.

– మత సామరస్యానికి ప్రతీకలు పండుగలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని బిల్డప్ వద్ద ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక చోట్ల ముస్లింలకు హిందూ సోదరులు ఇస్తార్ ఇస్తున్నారని చెప్పారు. రాజకీయ ఇఫ్తార్‌లు అనేక చోట్లు నిర్వహించారని పేర్కొన్నారు. దేశంలో మత సామరస్యాన్ని చాటుకుని భిన్నత్వంలో ఏకత్వం ఆచరించడం మనే సాధ్యమన్నారు. **జమ్మలమడుగు :** పేదలకు దానధర్మాలు చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ఇస్లాం ముఖ్య ఉద్దేశమని జమ్మలమడుగు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పెన్నా నది ఒడ్డున ఉన్న షాహి ఈద్గా ఆవరణలో జమ్మలమడుగు పట్టణం, మండల పరిధిలోని ముస్లింలు నమాజ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి కుటుంబీకులు, గురువులు ముస్లిం మైనారిటీ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లా జానీ, హజ్ కమిటీ చైర్మన్ గౌస్లాజం, కో-ఆప్షన్ సభ్యులు ఫయాజ్‌బాషా,వైసిపి నాయకులు షామీర్ అలీ పాల్గొన్నారు. నమాజు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. **వేంపల్లె :** స్థానిక ముస్లింలు శనివారం ఈద్ ఉల్ ఫితర్‌ను కొత్త బట్టలు, సువాసన కలిగిన అత్తర్‌తో ఈద్గా వద్దకు వెళ్లి ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో మసీదులు, ముఖ్యమైన ఈద్గాల వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు మౌలానా హర్షద్ పవిత్ర రంజాన్ విశిష్టతను తెలి పారు. అనంతరం ముస్లింలు హిందువులను విందులకు ఆహ్వా నించారు. శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి, ఆయా పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. **ముద్దనూరు :** రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలోని ముస్లింలు ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేకప్రార్థనలు చేశారు. తాడిపత్రి రహదారిలోని ఈద్గా వద్ద ముస్లింలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు చల్లటి తాగునీటి వాటర్ బాటిళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సుమంత్ యాదవ్ పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో యువనాయకులు గుణవంతరెడ్డి ముస్లింలకు చికెన్, కూరగాయలు అందజేశారు. మండల కేంద్రంలోని 700 కుటుంబాలకు పంపిణీ చేశారు. **చాపాడు :** ముస్లింలు శనివారం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ చదివి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఎంపిపి టి.లక్షుమయ్య, తహశీల్దార్ సుభాని, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ మైనుద్దీన్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. **ఖాజీపేట :** ముస్లింలు రంజాన్ పండుగ పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఈద్గాలలో మత గురువులు మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని చదివి వినిపించారు. దుంపలగట్టు ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని పలు మసీదుల్లో రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు పార్నపల్లి రోడ్డులో ఉన్న ఈద్గాలో ముస్లిం మత పెద్దలు రంజాన్ పండగ విశిష్టతను వివరించారు. అనంతరం వారు ప్రత్యేక పాత్రలు నిర్వహించారు. యాచకులకు దానధర్మాలు చేశారు. బంధుమిత్రులను విందుకు ఇంటికి ఆహ్వానించారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** పట్టణంలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బైసాని సత్యనారాయణ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని కొర్రపాడు రోడ్డులోని ఈద్గా వద్ద రస్నా పంపిణీ చేశారు. ఈ ఏడాది తన మిత్రుడు కడప జిల్లా కుంటి మల్లారెడ్డి సంక్షేమ అధ్యక్షుడు కత్తి విజయ్ సహకారంతో ఏర్పాటు చేశామని సత్యనారాయణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థలోని సభ్యులు అమరావతి శ్రీకాంత్, శేఖర్, రవి, మాధవ శివకృష్ణఆచారి పాల్గొన్నారు.



వేంపల్లె ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కేతవరం గ్రామంలో దూదేకుల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం కోసం శనివారం ఎంపిపి టి.లక్ష్మయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ.10.50లక్షలతో ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వేమారెడ్డి, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, గంజికుంట చంద్ర, దూదేకుల వాసులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి టి.లక్షుమయ్య

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వేంపల్లె

పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట కలిసేందుకు చేపట్టిన ఆత్మీయ సమ్మేళనం అనేది చాల సంతోషాన్ని ఇచ్చిందని ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1984-85 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు అందరూ ఒక వేదికపైకి రావడంతో అందరూ సంతోషంగా, ఉత్సాహంగా కబుర్లు చెప్పుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటల పాటలతో ఆలరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో రంజాన్ పండుగ సందర్భంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అందరూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం మాష్టర్ రాజా, రాజా కళా నిలయం, పులివెందుల వారి శిష్య బృందంచే జానపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు. కార్య క్రమంలో నృత్య శిక్షకులు రాజా, పరి పాలనా అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ప్రమాదకర మలుపులు.. పొంచి ఉన్న ప్రమాదాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలపరిధిలోని పలు మార్గాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపులు ఉన్న ప్రదేశాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహన దారులు భయాం దోళనకు గురవుతున్నారు. మలుపు ఉన్నట్లు తెలిసేలా సంబంధిత అధికారులు కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని పలు వురు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ప్రమాదాల నివార ణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో ప్రమాదకర మలుపు ఉన్నా అక్కడ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. బంగ్లా సమీపంలో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదకర మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అక్కడ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదని వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాజీపేట నుంచి గుడ్డివీరయ్య సత్రం (జివి సత్రం) వెళ్లే మార్గంలో చిల్లకనం వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఎక్కువగా వాహనదారులు పేర్కొంటున్నారు. చిల్లకనం వద్ద వాహనాలు ఖాజీపేటకు వచ్చే సమయంలో దారి అంత దిగుడుగా ఉంటుందని, వేగ నిరోధకాలు(స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే స్థానిక అగ్రహారం వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. ప్రమాదాల నివారణకు అక్కడ కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరమైన మలుపులు ఉన్న ప్రాంతాలో పలు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

చిల్లకనం వద్ద ఉన్న ప్రమాదకర మలుపు

బిజెపి ఓటమి అనివార్యం

ప్రజాశక్తి - కడప

2024లో నిర్వహిం చబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి బిజెపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు ఇచ్చి ఫేక్ సర్వేలు చేయించుకుని ఇటు ఓటర్లను, అటు ప్రతిపక్ష నాయకులను సందిగ్ధంలో పడేలా చేస్తున్నాయని విమర్శించారు. టైమ్స్ నౌ నవ భారత్ వారు సర్వే నిర్వహించి రాష్ట్రంలో వైసిపికి 24 నుంచి 25 పార్లమెంటు సీట్లు వస్తాయని చెప్పడం చాలా హాస్యాస్పదం అన్నారు. 24 నుంచి 25 కాదు కదా కనీసం 10 సీట్లు కూడా వైసిపికి రావని జోస్యం చెప్పారు. కేంద్రంలో బిజెపికి 292 నుంచి 300 సీట్లు వస్తాయని ప్రజలను మభ్య పెడుతున్నారని వాపోయారు. కేవలం రెండు, మూడు ప్రయివేట్ సంస్థల కోసం మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్లబాబు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, ఉపాధ్యక్షుడు నూతి సురేశ్, నగర మహిళ అధ్యక్షురాలు లావణ్య , బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA.

E.P.No. 48 of 2021 in

Original Suit No.1049 of 2019.

Between

Cherukuri Masthani, W/o C.Khasim, Dudekula, aged about 29 years, Residing at D.No.89/144, Angadi veedi, C.K.Dinne Mandal, Kadapa, Y.S.R.District. **...Petitioner/D.Hr./Plaintiff**

And

1. Derangula Pavan Kumar, S/o Late Subbarayudu, Hindu aged about 26 years (Defendant No.2)
2. Derangula Venkata Subbaiah, S/o Late Subbarayudu, Hindu aged about 24 years. (Defendant No.3)
3. Derangula Naveen Kumar, S/o Late Subbarayudu, Hindu, aged about 23 years, (Defendant No.4)

All are residing at D.No.121 Chandra Prathap Reddy Colony, C.K.Dinne Mandal, Kadapa, Y.S.R.District.

...Respondents/ J.Dr.'s/Defendants

ప్రతివాదులకి రెస్పాండెంట్ నెం.2 అండ్ 3కు నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాదుల రెస్పాండెంట్స్ నెంబరు 2 అండ్ 3 హాజరు నిమిత్తము తేది.02.05.2023 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఆర్.సురేష్ కుమార్

అడ్వకేటు, కడప. సెల్: 9866873193.